
రథంపై ఉత్సవమూర్తులు


భారీగా తరలి వచ్చిన భక్తులు

వైభవంగా ఆదిదంపతుల రథోత్సవం

- అశేషంగా తరలి వచ్చిన భక్తులు
- రమావాణి సేవిత రాజరాజేశ్వరి అలంకారంలో భ్రామరి
- నేడు స్వామిఅమ్మవార్లకు అశ్వ వాహన సేవ
- నిజాలంకరణలో దర్శనమివ్వనున్న అమ్మవారు


వేడుకల్లో ఆలయ ఈఓ, శ్రీశైల పీఠాధిపతి


మహిళల కోలాటం


ఉత్సవాల్లో భాగంగా యువకులు


వివిధ వేషధారణల్లో కళాకారులు


కర్ణాటక కళాకారుల ప్రదర్శన

శ్రీశైలం, ఏప్రిల్ 9: ఉగాది మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని దేవదేవులకు వైభవంగా రథోత్సవం జరిగింది. సాయంత్రం రథశాల వద్ద ఆలయ అర్చకులు రథానికి రథాంగ పూజ, రథాంగ హోమం, రథాంగ బలి కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి ఉభయ దేవాలయ ప్రాంగణంలో విశేష అర్చనలు, హారతులందుకున్న స్వామి, అమ్మవార్లను పల్లకిలో రాజగోపురం మీదుగా రథశాల వద్దకు మేళతాళాలు, భజంత్రీల నడుమ తోడ్కొని వచ్చారు. పుష్ప ప్రియుడైన మల్లయ్యకు సుగంధ పుష్పాలు, పరిమళ ద్రవ్యాలతో అలంకరించిన రథంపై ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేసి సాత్విక బలిగా కొబ్బరికాయలను, గుమ్మడికాయలను సమర్పించారు. గంగాధర మండపం నుంచి నంది మండపం దాకా, అక్కడి నుంచి తిరిగి గంగాధర మండపం వరకు రథోత్సవం సాగింది. రథంపై ఆదిదేవులు ఆశీనులై సాగుతుండగా భక్తులు మల్లయ్య శ్రీగిరి మల్లయ్య నామస్మరణ చేస్తూ ఆది దేవుల వైభవాన్ని కల్లారా వీక్షిస్తూ పరవశించారు. రథం ముందు కోలాటం, కర్ణాటక జాంజ్, వీరగాసి, కొమ్ము వాయిద్యం, నందికోలు సేవ, బీరప్పడోలు, పగటి వేషధారణ ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. రథోత్సవంలో అధికారులు, శ్రీశైల జగద్గురు పీఠాధిపతి, ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్న సిద్ధరామ పండితారాధ్యా శివాచార్య మహాస్వామీజీ దర్శించుకున్నారు. అదేవిధంగా నంద్యాల జిల్లా జయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి దర్శించుకుని పల్లకీ సేవలో పాల్గొన్నారు.

శ్రీశైలంలో పంచాంగ శ్రవణం

శ్రీశైల మహా క్షేత్రంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం ఆలయ ప్రాంగణంలోని నిత్య కల్యాణ మండపంలో పంచాంగ పఠనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశైల దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి పండిత బుట్టే వీరభద్ర దైవజ్ఞ, రాజమండ్రి వారు పంచాంగ శ్రవణం చేశారు. పంచాంగ శ్రవణం కంటే ముందు లోకకళ్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు, వేదపండితులు దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగిన వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికీ ఆయురారోగ్యాలు కలగాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, అన్ని సామాజిక వర్గాలు సుఖసంతోషాలతో ఉండాలని సంకల్పాన్ని పఠించారు. తరువాత స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం నూతన పంచాంగానికి పూజలు చేశారు. కార్యనిర్వాహణాధికారి డి. పెద్దిరాజు దేవస్థానం తరపున ఆస్థాన సిద్ధాంతి పండిత బుట్టే వీరభద్ర దైవజ్ఞ వారికి స్వామి, అమ్మవార్ల ప్రసాదాలను, శేషవస్త్రాలను అందజేసి పంచాంగ పఠనానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సిద్ధాంతి క్రోధినామ సంవత్సర విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశమంతటా సగటు వర్షపాతం నమోదవుతుందన్నారు. ఉత్తరాదిన నదులన్నీ పొంగి ప్రవహిస్తాయని తెలిపారు. అలాగే దేశంలో ఆహారధాన్యాలు సమృద్ధి ఉంటాయన్నారు. పల్లపు భూములు విశేషంగా పండుతాయన్నారు. మిర్చి, పత్తి, పొగాకు, ఎరుపు ధాన్యాలకు మంచి దిగుబడి ఉందని చెప్పారు. నూనెగింజల ఉత్పత్తులు పెరుగుతాయ్నారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


క్రోధినామ సంవత్సర విశేషాలను వివరిస్తున్న దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి పండిత బుట్టే వీరభద్ర దైవజ్ఞ

రమావాణీసేవిత రాజరాజేశ్వరి అలంకరణలో అమ్మవారు

ఉగాది ఉత్సవాల్లో అమ్మవారి అలంకారాలలో భాగంగా మంగళవారం రమావాణీసేవిత రాజరాజేశ్వరీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ముందుగా అర్చకులు అమ్మవారి ఉత్సమూర్తికి రమావాణీ సేవిత రాజరాజేశ్వరి అలంకారం చేసి విశేష పూజలు చేసి మంగళ హారతులు ఇచ్చారు.

నేడు అశ్వవాహన సేవ : ఉగాది ఉత్సవాల్లో చివరి రోజు బుధవారం భ్రమరాంబదేవి నిజాలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. రాత్రి స్వామి అమ్మవార్లకు అశ్వవాహన సేవ ఆలయ ఉత్సవం నిర్వహించనున్నారు.

రమావాణి సేవిత రాజరాజేశ్వరి అలంకారంలో భ్రామరి, పూజలు చేస్తున్న అర్చకులు



ఉగాది శుభాకాంక్షలు: కలెక్టర్


కలెక్టర్‌కు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్న పండితులు

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 9: జిల్లా ప్రజలందరికీ క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలను కలెక్టర్ డా.జి.సృజన తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వేద పండితులు, అర్చకులు కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపి కలెక్టర్‌ను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తీపి, పులుపు, చేదు, వగరు, ఉప్పు కారంతో తయారు చేసిన ఉగాది పచ్చడిలాగే మనిషి జీవితంలో ఎదురయ్యే కష్టాలు, సుఖాలు, ఆనందాలు, బాధలన్నింటికీ ఉగాది పచ్చడి ప్రతీక అని అన్నారు. ప్రజలందరూ సుఖ, సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ నారాయణరెడ్డి, వేద పండితులు మల్లికార్జున శర్మ, అర్చకులు సత్యనారాయణస్వామి, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని చాటిచెప్పాలి

- శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు
- మంత్రాలయంలో ఉగాది వేడుకలు


పంచాంగ శ్రవణంలో పాల్గొన్న పీఠాధిపతి

మంత్రాలయం, ఏప్రిల్ 9: భారతదేశ సంస్కృతీ, సంప్రదాయాలు, సనాతన హిందూ ధర్మాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పాలని శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు ఉద్బోధించారు. మంత్రాలయంలో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి ఊంజల మండపంలో గురుసార్వభౌమ సంస్కృత పాఠశాల రిటైర్డు ప్రిన్సిపల్ వాదిరాజాచార్ పంచాంగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ క్రోధి నామసంవత్సరంలో సకాలంలో వర్షాలు కురిసి రైతులు, పాడిపంటలు, పాడి పశువులు సస్యశ్యామలంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రపంచ శాంతి కోసం రాఘవేంద్రస్వామికి పూజలు చేస్తున్నట్లు తెలిపారు. హిందూ సనాతన ధర్మాలు కొత్త సంవత్సరంలో అందరికీ శుభాలు కలగాలని, ఉగాది కొత్త సంవత్సరంగా సంతోషంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్వాన్ రాజా ఎస్.గిరిరాజాచార్, మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, వ్యాసరాజాచార్, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్టిపడిన ఉగాది

- తెలుగు సంస్కృతి ప్రతిబింబించేలా వేడుకలు
- పలుచోట్ల ఉగాది పచ్చళ్ల పంపిణీ
- సందడిగా సాగిన పంచాంగ పఠనం
- పుణ్యక్షేత్రాల్లో భక్తుల కోలాహలం

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 9: తెలుగు వారికి తొలి సంవత్సరారంభ వేడుక 'క్రోధి' నామ సంవత్సర ఉగాది పండుగ మంగళవారం ఉమ్మడి జిల్లాలో ఘనంగా నిర్వహించుకున్నారు. వేకువ జాము నుంచే వేడుక నిర్వహణకు సన్నద్ధమయ్యారు. తమ గృహ ద్వారాలను బంతి పూలతో ప్రత్యేకంగా అలంకరించి, మామిడి ఆకుల తోరణాలు కట్టి, ఉగాది లక్ష్మిని తమ ఇంటికి ఆహ్వానించారు. తీపి, చేదు, వగరు, పులుపు, ఉప్పు, కారంలతో చేసిన షడ్రుచుల ఉగాది పచ్చడిని, పిండి వంటలను నైవేద్యంగా అమ్మ వారికి సమర్పించారు. ఆ తర్వాత సంప్రదాయ పద్ధతిలో ఉగాది పచ్చడిని స్వీకరించారు. సాయంత్రం నూతన వస్త్రాలు ధరించి, సమీపంలోని ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణ కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ ఏడాది వ్యవసాయం, వర్షాలు, గ్రహ స్థితులు, దేశ కాలమాన పరిస్థితులు, తమ తమ రాశుల ఫలితాలను పంచాంగ పఠన కర్తల ద్వారా వింటూ వేడుకలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉగాది పర్వదిన సందర్భంగా వివిధ ఆలయాల్లో ఉగాది పచ్చళ్లను పంపిణీ చేశారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని గ్రామ దేవతల ఆలయాలకు వెళ్లి ఉదయాన్నే పూజాది కార్యక్రమాలు చేపట్టారు. ఆలయాలు భక్తులతో కిక్కిరిపోయాయి. ఇండ్లలో కుటుంబ సమేతంగా ఉగాది పచ్చళ్లు, పలు రకాల పిండి వంటలు చేసుకుని వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ ఏడాది ఉగాది వేడుకలు వైభవంగా సాగాయి. గ్రీష్మతాపం తీవ్రంగా ఉన్నా ఆలయాల వద్ద భక్తుల సందడి బాగా కనిపించింది. ఉమ్మడి జిల్లాలోని ప్రసిద్ధ ఆలయాలు వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన యాత్రికులతో కిటకిటలాడాయి.


హొళగుంద మండలం గజ్జెహళ్లి గ్రామంలోని పోతులింగేశ్వర ఆలయ ప్రాంగణంలో 120 కిలోల రాతిగుండును ఎత్తిన యువకుడు సుబ్బు


గోనెగండ్ల మండల కేంద్రంలో సుంకులా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అశేష భక్తజనం నడుమ కొనసాగుతున్న ప్రభోత్సవం

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు సన్నాహాలు

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 9: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి మే నెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నియోజకవర్గం ఫెసిలిటేషన్ సెంటర్లలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు జిల్లా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మే 5వ తేదీన పీవో, ఏపీవోలకు, 6వ తేదీన ఓపీవోలకు, 7న పోలీస్, ఏవీఈఎస్, 8వ తేదీన అదర్ డిస్ట్రిక్ట్ ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఉంటుందని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే 33 నిత్యావసర సేవలు అందించే శాఖలకు చెందిన వారికి ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పించింది. 85 సంవత్సరాల వయస్సు పైబడిన వారు, వికలాంగ ఓటర్లు హోం ఓటింగ్ సౌకర్యం కోసం ఫారం-12డీ, మిగతావారు ఫారం-12, ఈ నెల 22వ తేదీలోపు రిటర్నింగ్ అధికారులకు సమర్పించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఓటింగ్‌కు సంబంధించి అసెంబ్లీ గులాబీరంగు, పార్లమెంటు తెలుపురంగు పోస్టల్ బ్యాలెట్ పత్రాన్ని ఇవ్వనున్నారు. వీటితో పాటు ఫారం-13ఏ డిక్లరేషన్, ఫారం-13బీ ఇన్నర్ ఎన్వలోప్, ఫారం-13డీ తదితర పూర్తి చేయాల్సి ఉంటుంది.

వైభవంగా రథోత్సవం


వేలాది మంది భక్తుల నడుమ సాగుతున్న వల్లెలాంబదేవి రథం

కోడుమూరు, ఏప్రిల్ 9: ఉగాది పండుగ పురస్కరించుకొని వల్లెలాంబదేవి అమ్మవారి రథోత్సవం మంగళవారం సాయంత్రం కన్నుల పండువగా సాగింది. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా రథాంగ హోమం చేపట్టారు. సాయంత్రం భక్తులు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ప్రతిష్ఠించారు. రథోత్సవం ప్రారంభం కావడంతో భక్తులు భక్తి పరవశంతో మునిగిపోయారు. ఎంతో వైభవంగా నిర్వహించిన ఈ వేడుకలను కనులారా చూసేందుకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు భారీ ఎత్తున కదిలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. రథోత్సవం అనంతరం భక్తులు అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు. పోలీసులు బందోబస్తు చేట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, ఎద్దుల మహేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, ఈశ్వర్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, రవిబాబు, శ్రీనివాసులు, రమేష్‌నాయుడు, మల్లారెడ్డి, డాక్టర్ సతీష్, వెంకటస్వామి ఆచారి తదితరులు పాల్గొన్నారు.


చౌడేశ్వరి దేవి


అమ్మవారి ఆలయం చుట్టూ బురద

ఘనంగా చౌడేశ్వరీ దేవి జ్యోతి మహోత్సవాలు

- ప్రత్యేక ఆకర్షణగా ఎద్దులబండ్ల ప్రదర్శన
- వేడుక చూసేందుకు తరలివచ్చిన భక్తులు

కల్లూరు, ఏప్రిల్ 9: ఉగాది పర్వాదినాన్ని పురస్కరించుకుని కల్లూరు చౌడేశ్వరీదేవి ఆలయంలో జ్యోతి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం ఆలయ కార్యనిర్వహణ అధికారి గుర్రెడ్డి, చైర్మన్ పోలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భక్తుల దర్శనార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేయగా భక్తులు పెద్దఎత్తున పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆలయంలో పంచాంగ పఠనం, అమ్మవారి నక్షత్ర దీపోత్సవం, శకటోత్సవ సేవలు నిర్వహించారు. కల్లూరులోని చౌడేశ్వరీదేవి ఆలయంలో సాంప్రదాయ బద్ధంగా వస్తున్న అమ్మవారి ఆలయం చుట్టూ ఎద్దుల బండ్లు, గాడిదలతో ప్రదక్షిణ చేయడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఆలయ నిర్వాహకులు గత రెండ్రోజుల క్రితం ఆలయం చుట్టూ నీరు వదిలి బురదమట్టి తయారు చేశారు. ప్రతి ఏడాది వర్షాలు సకాలంలో కురవాలి, పాడి పంటలు సమృద్ధిగా పండాలి, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతో గ్రామపెద్దలు దశాబ్దాలుగా ఈ అచారాన్ని సాగిస్తున్నారు. ఈ మేరకు కల్లూరు ప్రాంత రైతులు ప్రతి ఏడాది ఎద్దుల బండ్లతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉగాది ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా ఎద్దుల బండ్ల ప్రదర్శన నిలవగా కేరింతలు కొడుతూ రైతులు తమ ఎద్దులతో అమ్మవారి ఆలయం చుట్టూ బండ్లు తిప్పడం విశేషం. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కల్లూరు చౌడేశ్వరిదేవి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చౌడేశ్వరిదేవి జ్యోతిమహోత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారు జామున కల్లూరులోని ఊరువాకిలి నుండి జ్యోతులు అమ్మవారి చెంతకు బయలుదేరనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తురాలు




చౌడేశ్వరి దేవి ఆలయం చుట్టూ వదిలిన నీటితో చిన్నారుల కోలాహలం


అమ్మవారి ఆలయం చుట్టూరు ఎద్దుల బండ్ల పోటీల్లో యువకుల ఉత్సాహం


చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలకు తరలి వచ్చిన భక్తులు


చౌడేశ్వరి దేవి ఆలయం చుట్టూ తిరుగుతున్న ఎద్దుల బండ్లు

జగన్‌కు ఓటమి భయం : టీడీపీ

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బస్తిపాటి నాగరాజు, బీవీ జయనాగేశ్వరరెడ్డి


మాట్లాడుతున్న జయనాగేశ్వరరెడ్డి, నాగరాజు

గోనెగండ్ల, ఏప్రిల్ 9: సీఎం జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే, కర్నూలు ఎంపీ అభ్యర్థులు బీవీ జయనాగేశ్వరరెడ్డి, బస్తిపాటి నాగరాజు అన్నారు. మంగళవారం గోనెగండ్ల మండల పరిధిలోని గాజులదిన్నె గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపీపీ హనుమంతును వారు పరామర్శించారు. అనంతరం పిల్లిగుండ్ల గ్రామంలోని టీడీపీ నాయకుడు ఉల్లిగడ్డ రాముడును పరామర్శించారు. ఈ సందర్భంగా బస్తిపాటి నాగరాజు, బీవీ జయనాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ అవినీతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను సాగనంపేందుకు ప్రజలు సిద్ధమయ్యారన్నారు. బీసీలకు జగన్ ప్రభుత్వంలో తీరని అన్యాయం జరిగిందన్నారు. జగన్ ఓటమి భయంతోనే బీసీల రాగం పాడుతున్నాడన్నారు. జగన్ మాటలను నమ్మేస్థితిలో బీసీలు లేరన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్‌డీఎస్ పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తామన్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. క టీడీపీ అధికారంలోకి వచ్చిన మహిళలకు ఏడాదికి మూడు సిలిండర్‌లు ఉచితంగా ఇస్తామన్నారు. మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం, 18 ఏళ్ల దాటిని మహిళలకు నెలకు రూ. 1500, నిరుద్యోగులకు నెలకు రూ. 3000 ప్రతి గ్రామానికి తాగునీరు, రోడ్ల సమస్య లేకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత మాజీ ఉపాధ్యక్షుడు రామకృష్ణ, మాజీ సర్పంచ్ సంజన్న, వేణుగోపాలాచారి, ప్రభాకర్, చంద్ర, యాకోబు, నజీర్‌సాహెబ్, తిరుపతయ్యానాయుడు, జయపాల్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ఉగాది బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ఆలయం చుట్టూ పన్నేరపు బండ్లు తిప్పుతున్న రైతులు

బనగానపల్లె రూరల్, ఏప్రిల్ 9: జిల్లాలోని నందవరం చౌడేశ్వరీదేవి ఆలయంలో మంగళవారం నుంచి ఉగాది బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వహణాధికారి జి.కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఉగాది ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఉదయం 6 గంటలకు అమ్మవారికి మహా మంగళహారతి, గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఆలయ ఆవరణలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. అమ్మవారి దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సాయంత్రం మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామానికి చెందిన రైతులు సాంప్రదాయంగా ఎండ్ల బండ్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయం చుట్టూ పన్నేరపు బండ్లు తిప్పారు. 6.30 గంటల ప్రాకార రథోత్సవం నిర్వహించారు. రాత్రి ఏర్పాటు చేసిన పౌరాణిక నాటక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

నేడు శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం : ఉగాది ఉత్సవాల్లో భాగంగా నందవరం గ్రామంలో రెండో రోజు బుధవారం రాత్రి 9 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం చౌడేశ్వరీదేవికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాత్రి కల్యాణోత్సవం అనంతరం స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం ఉంటుందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ జి.కామేశ్వరమ్మ తెలిపారు. రాత్రి 10గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

నేడు పిడకల సమరం

- కైరుప్పలలో సిద్ధం

ఆస్పరి, ఏప్రిల్ 9: ఉగాది పండుగ సందర్భంగా ఆస్పరి మండలం కైరుప్పలలో జరిగే పిడకల సమరానికి ఓ ప్రత్యేకత ఉంది. పండుగ మరుసటి రోజు ఏటా ఈ వేడుక జరుగుతుంది. బుధవారం కైరుప్పల గ్రామంలో పిడకల సమరం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ వేడుకలో పాల్గొనడానికి సమీప గ్రామాలైన పుష్పాలదొడ్డి, చెన్నంపల్లి, వెంగళాయదొడ్డి, కారుమంచి, కలపరి, వలగొండ, పుటకలమర్రి, యాటకల్లు వస్తారు. వారు రెండు వర్గాలుగా విడిపోయి పిడకలతో కొట్టుకోవడం, అనంతరం కలిసిపోవడం ఆచారంగా వస్తోంది. ఈ పిడకల సమరాన్ని తిలకించేందుకు మండలంలోని గ్రామాల ప్రజలతో పాటు ఇతర రాష్ట్రాల నుండి కూడా జనం తరలివస్తారు. వీరభద్రస్వామి, భద్రకాళి ప్రేమాయణంలో తలెత్తిన ఓ చిన్న వివాదానికి గుర్తుగా దీన్ని జరుపుకుంటారు. ఉదయం ప్రత్యేక పూజలు చేస్తారు. సాయంత్రం పుష్పాలదొడ్డి, చెన్నంపల్లి గ్రామస్తులు తమ గ్రామదేవతలను పల్లకిలో కైరుప్పల ఆలయంలోకి తీసుకొస్తారు. అప్పటికే ఆలయంలో సిద్ధంగా ఉంచిన పడకలను రెండు వర్గాల వారు ఒకరిపై ఒకరు విసురుకుంటారు. ఈ పిడకల సమరం ఒళ్లు గగుర్పొడిచేలా దాదాపు గంటపాటు సాగుతుంది. దీన్ని పెద్ద నుగ్గులాట అని కూడా అంటారు. పుష్పాలదొడ్డి గ్రామంలో చిన్న నుగ్గులాట మంగళవారం నిర్వహించారు. గ్రామంలో వెలసిన గిడ్డయ్యస్వామి వారి పల్లకి ఉత్సవాలు కల్లపరి, వెంగళాయదొడ్డి గ్రామ పొలిమేర చుట్టూ సాగింది.


ఆలయ ప్రాంగణంలో సమరానికి సిద్ధంగా ఉంచిన పిడకలు

గన్‌తో బెదిరింపులు

- ఎన్నికల వేళ కలకలం
- ఆలస్యంగా వెలుగులోకి..

పెద్దకడుబూరు, ఏప్రిల్ 9: భూమి తగాదాలో ఓ వర్గం రైతులు రిటైర్డు పోలీసు అధికారి అండతో అవతలి వాళ్లను గన్‌తో బెదిరించినట్లు ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన అల్లయ్యగారి పెద్ద ఉరుకుందు, అల్లయ్య గారి నాగరాజు అన్నదమ్ములు. వీరికి . పెద్దకడుబూరు మండలం హులికన్వి గ్రామ పరిధిలో సర్వేనెం. 29లో 4.77 ఎకరాల భూమి ఉంది. ఇది పూర్వీకుల నుంచి వీరికి సంక్రమించింది. అయితే ఇటీవల ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో ఈ భూమిలో 33 సెంట్ల భూమి ఆక్రమణకు గురైనట్లు బయటపడింది. ఆ భూమిని తమకు అప్పగించాలని ఆక్రమించుకున్న పక్కపొలం వారిని కోరారు. అయితే ఆ భూమి తమదేనని ఆక్రమించుకున్నవారు అన్నారు. దీంతో బాధితులు హైకోర్టుకు వెళ్లారు. దీనిపై కోర్టు స్పందిస్తూ భూమిని సర్వేచేసి బాధితులకు హద్దులు చూపాలని ఆదేశించింది. ఈ మేరకు రెవిన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి రాళ్లు పాతారు. ఈ సందర్భంగా అవతలి వాళ్లు రెవెన్యూ, పోలీసు అధికారులను అడ్డుకున్నారు. దీంతో వారిపై అధికారులు కేసు నమోదు చేశారు. దీన్ని లెక్క చేయకుండా ఆక్రమణదారులు రాళ్లను తొలగించారు. అంతేగాక ఈ ఏడాది మార్చి 31వ తేదీన ఓ రిటైర్ట్ పోలీసు అధికారితో పాటు ఆక్రమణదారులు, మరికొందరు వ్యక్తులు పొలం దగ్గరకు గన్‌తో వచ్చి పంచాయితీకి రమ్మని బాధితులను పిలిచారు. అక్కడ ఓ రిటైర్ట్ పోలీసు అధికారి, ఆయనతో పాటు మరో వ్యక్తి గన్ పట్టుకొని బాధితులను, వారి కుటుంబ సభ్యులను బెదిరించారు భూమి వదులుకోకపోతే గన్‌తో లేపేస్తామని తమను బెదిరించినట్లు బాధితులు తెలిపారు. వారు పెద్దకడుబూరు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు మూడు రోజులు స్టేషన్ చుట్టూ తిప్పుకొని చివరకు ఆక్రమణదారులైన ఐదుగురిపై మాత్రమే కేసు నమోదు చేశారు. అయితే తమను బెదిరించిన రిటైర్ట్ పోలీసు అధికారి, ఆయనతోపాటు వచ్చిన గన్ పట్టుకున్న వ్యక్తిని, మరి కొందరిపై కేసు పెట్ట లేదని బాధితులు ఆరోపించారు. ఎన్నికల వేళ ఈ గన్ ఉదంతం కలకలం సృష్టించింది. వాస్తవంగా గన్ లైసెన్స్ ఉన్నవారు స్థానిక పోలీసు స్టేషన్‌లో డిపాజిట్ చేయాలి. రిటైర్ట్ పోలీసు అధికారి వద్ద ఉన్న గన్‌కు లైసెన్స్ ఉందా.. లేదా.. ఉంటే స్టేషన్‌లో ఎందుకు డిపాజిట్ చేయలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూ పంచాయతీలో గన్‌తో కలకలం సృష్టించిన వారిపై కేసులు ఎందుకు నమోదు చేయలేదో అంతుబట్టడం లేదు. ఈ విషయంపై పెద్దకడుబూరు ఎస్సై మహేష్‌కుమార్‌ను వివరాలు అడుగగా.. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నామని అన్నారు.


గన్ పట్టుకొని భూమి విషయంలో బాధితులను బెదిరిస్తున్న దృశ్యం

ఏడు జతల పొట్టేళ్లతో రథ యాత్ర


ముత్తలూరులో పొట్టేళ్లతో రథాన్ని లాగిస్తున్న దృశ్యం

రుద్రవరం, ఏప్రిల్ 9 : మండలంలోని ముత్తలూరు గ్రామ సు_లు మంగళవారం ఏడు జతల పొట్టేళ్లతో హనుమంతుని రథ యాత్ర నిర్వహించారు. గ్రామం నుంచి నాలుగు కిమీ పొడవునా పొట్టేళ్ల రథాన్ని లాగాయి. రథంలో హనుమంతుని విగ్రహాన్ని ఉంచి యాదవులు ఇలా రథాన్ని లాగించడం ఆనవాయితీ. లింగమయ్య స్వామి దేవాలయానికి రథంతో చేరుకుని అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు నిర్వహించిన కోలాటం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే రుద్రవరం, కొండమాయపల్లె ఇంకా పలు గ్రామాల్లో హనుమంతునికి ఆకుపూజ చేసి ప్రత్యేక పూజలు చేశారు.

తండ్రిని చంపిన తనయుడు

మిడుతూరు, ఏప్రిల్ 9: ఆస్తి కోసం ఓ కొడుకు తండ్రిని హత్య చేశాడు. ఈ ఘటన మిడ్తూరు మండలం తలముడిపి గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన కురువ అయ్యన్న(85)కు ఇద్దరు కుమారులు. ఇంటిని పంచి ఇవ్వాలని చిన్న కుమారుడు శ్రీనివాసులు చాలా కాలం నుంచి తండ్రి అయ్యన్నను కోరుతున్నారు. అయితే కుమారుడికి చెడు అలవాట్లు ఉండటంతో ఇల్లు పంచి ఇస్తే అమ్మేస్తాడని అయ్యన్న అంగీకరించలేదు. ఈ విషయంలో సోమవారం శ్రీనివాసులు కోపంతో కర్రతో తండ్రి తల మీద కొట్టాడు. తీవ్ర గాయాలపాలైన అయ్యన్నను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆయన కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతడి పెద్దకుమారుడు బాలుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మిడ్తూరు ఎస్.ఐ జగన్మోహన్ తెలిపారు.

రైలు నుంచి జారి పడి యువకుడి మృతి

కోసిగి, ఏప్రిల్ 9: మంగళవారం తెల్లవారుజామున కోసిగి మండలం కుప్పగల్ ఆర్ఎస్‌ల మధ్య కేఎం.నెం.520/11-09 వద్ద బీహార్ రాష్ట్రానికి చెందిన తునిలాల్ మాంజి (25) అనే యువకుడు ప్రమాదవశాత్తు రైలు నుండి జారి పడి మృతి చెందాడు. ఆదోని రైల్వే ఎస్ఐ గోపాల్ ఈ విషయం తెలిపారు. రైలు.నెం.12617 నుంచి డౌన్ లైన్ నుంచి ఎగిరి అప్‌లైన్ ట్రాక్‌లో పడి తీవ్ర రక్తగాయాలతో మాంజి మృతి చెందాడని ఆయన తెలిపారు. మృతుని వద్ద బెంగుళూరు నుంచి న్యూఢిల్లీ వెళ్లే రైల్వే జనరల్ టికెట్ ఉందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆటో ప్రమాదంలో ఒకరు మృతి

ముగ్గురికి గాయాలు

కోవెలకుంట్ల, ఏప్రిల్ 9: అదుపుతప్పి ఆటో బోల్తాపడటంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కోవెలకుంట్ల పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. కోవెలకుంట్లకు చెందిన చుక్కా సుబ్బరాయుడు, చుక్కా రాజు, కంపమల్ల జయన్న, మరొక వ్యక్తితో కలిసి ఆటోలో అమడాలకు వెళ్ళి అక్కడ పని ముగించుకుని తిరిగి కోవెలకుంట్లకు బయల్దేరాడు. నాట్ల వెంకటేశ్వర రెడ్డి ఇంటి సమీపంలోకి వచ్చేసరికి ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో చుక్కా సుబ్బరాయుడు (52)అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న మిగతా ముగ్గురు గాయపడ్డారు. సుబ్బరాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వరప్రసాద్ తెలిపారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం



ప్రచారం చేస్తున్న బొగ్గుల దస్తగిరి

సి.బెళగల్, ఏప్రిల్ 9: వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ మండలంలోని ముడుమాల, ఈర్లదిన్నె, శింగవరం, కొత్తకోట గ్రామాలకు తాగడానికి నీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప జగన్ పాలనలో ఎక్కడ అభివృద్ధి జరగలే దన్నారు. వైసీపీకి ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, ఎంపీటీసీ ఈరన్నగౌడు, మాజీ ఎంపీటీసీలు యాకోబు, రంగన్న, సర్పంచులు అమర్, చెర్వుపల్లె రాజు, మల్లికార్జునగౌడు, సోమనాథ్‌గౌడు, చంద్రశేఖర్‌గౌడు, ప్రకాశ్ గౌడు, బాలాజీ వెంకటేశ్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం: మండల కేంద్రంలో టీడీపీ కార్యాలయాన్ని కోడుమూరు పార్టీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా మండల కేంద్రంలో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించామ న్నారు. టీడీపీ కార్యకర్తలంతా కలిసి కట్టుగా సైనికులాగా పనిచేయాలని పిలు పునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప, బీమన్న, రత్నం, నల్లన్న, అమర్, మోషన్న పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి



గొందిపర్లలో ప్రచారం చేస్తున్న బొగ్గుల దస్తగిరి భార్య సుధారాణి

కర్నూలు(రూరల్), ఏప్రిల్ 9: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి భార్య సుధారాణి అన్నారు. మంగళవారం కర్నూలు రూరల్ మండలం గొందిపర్ల గ్రామంలో ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను ఆమె ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తోందన్నారు. దీపం పథకం క్రింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్‌లు ఉచితంగా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నాగరాజు, మాజీ సర్పంచు సోమన్న, నాయకులు సుధాకర్, జనసేన నాయకులు రాం బాబు, రమేష్, చిన్న నరసింహ ప్రవీణ్, రవికుమార్ పాల్గొన్నారు.

● కర్నూలు రూరల్ మండలం పసుపుల గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీసాయి విష్ణునివాస్, బాలాజీహిల్స్, కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొగ్గుల భాస్కర్, రామకృష్ణ, ఎల్లయ్య, నాగిరెడ్డి పాల్గొన్నారు.

కృష్ణానగర్‌లో షార్ట్‌సర్క్యూట్

బాధితులను పరామర్శించిన గౌరు వెంకటరెడ్డి



బాధితులను పరామర్శిస్తున్న గౌరు వెంకటరెడ్డి

కల్లూరు, ఏప్రిల్ 9: 27వ వార్డు కృష్ణానగర్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో రవీంద్రస్కూల్ సమీపంలోని కిరాణ షాప్, ఇంట్లో విలువైన వస్తువులు కాలిపోయాయి. మంగళవారం నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదం వివరాలను అడిగి తెలుసు కున్నారు. అనంతరం బాధితులను ఆయన పరామర్శించారు. ఆయన వెంట ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, కేతురు మధు ఉన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

గూడూరు, ఏప్రిల్ 9: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు తెలుగు శ్రీనివాసులు అన్నారు. మంగళవారం గూడూరులోని తెలుగువీధి 17 వార్డులో తెలుగు శ్రీనివాసులు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు ఇంటింటికి వెళ్ళి బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కింద సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. జిల్లా టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి నాయ కత్వంలో కోడుమూరు నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగుర వేసి చంద్ర బాబుకు కానుకగా ఇద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, విష్ణు సేన అభిమానులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి

ఓర్వకల్లు, ఏప్రిల్ 9: ఓర్వకల్లు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త షేక్షావలి (32) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. అర్థరాత్రి 2 గంటల సమయంలో ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే షేక్షావలి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు, తరలివచ్చి షేక్షావలి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉంది. నివాళి అర్పించిన వారిలో టీడీపీ నాయకులు గోవిందరెడ్డి, లక్ష్మీకాంత రెడ్డి, అన్వర్‌బాషా, అల్లాబాబు, ఎల్లయ్య, అబ్దుల్లా ఉన్నారు.

వైభవంగా ఉగాది

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 9: నగరంలో ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించుకున్నారు. వివిధ ప్రాంతాల్లో వెలసిన గ్రామ దేవతల ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. కొత్త బస్టాండు వెనుక ఉన్న కల్లూరు చౌడేశ్వరి దేవి ఆలయం వద్ద అమ్మవారి దర్శనం కోసం ప్రజలు బారులు తీరారు. అలాగే ప్రకాశ్‌నగర్‌లోని సుంకులమ్మ దేవాలయంలో అమ్మవారిని న్యాయవాది శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఊరేగించారు. బుధవారపేటలోని సుంకులమ్మ దేవాలయం, నెహ్రూ రోడ్డులోని మారెమ్మ దేవాలయం, సప్తగిరి నగర్‌లోని అయ్యప్ప ఆలయంలోని సుంకులమ్మ దేవాలయం, చిత్తారి వీధిలోని నిమిషాంబాదేవి ఆలయంలో ఉగాది సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. నగరలోని వివిధ దేవాలయాల్లో సాయంత్రం జరిగిన పంచాంగ శ్రవణ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రద్ధగా ఆలకించారు. ఈ ఏడాది పంచాంగం ప్రకారం ఏరాశుల వారికి ఎలాంటి ఫలితాలు ఉన్నాయో తెలుసుకున్నారు.

● టీటీడీ- హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో... క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుక సందర్భంగా మంగళవారం సాయంత్రం పాతన గరంలోని శ్రీరాంభొట్ల దేవాలయంలో ఉగాది పంచాంగ శ్రవణ కార్యక్రమం, ఉగాది పచ్చడి వితరణ, శ్రీమద్రామాయణ ప్రవచన సప్తాహం ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీపాద నరేశ్‌కుమార్ శర్మ పంచాంగ పఠనం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ రాశి ఫలాలు, రాష్ట్ర, దేశ కాలమాన పరిస్థితులు, వ్యవసాయం, వర్షాలు తదితర అంశాలను ఆయన వీనులవిందుగా పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్‌పర్సన్ నగరూరు దీప్తి, కార్పొరేటర్ నగరూరు శ్రీనివాసరావు, ఆలయ ఈవో పి. దినేష్, టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, ధర్మ ప్రచార మండలి సభ్యులు పసుపులేటి నీలిమ, అర్చకుడు కె.గిరీశ్వర శర్మ, ఆలయ కమిటీ సిబ్బంది పెద్ది శ్రీనివాసులు, కృష్ణ కాంత్‌శర్మ, జె. విజయకుమార్, సంపతి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

ఓర్వకల్లు: మండలంలోని వివిధ గ్రామాల్లో క్రోధినామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం జరుపుకున్నారు. గ్రామాల్లో వెలసిన ఆలయాలకు వెళ్లి స్వామి, అమ్మవార్లకు కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఓర్వకల్లులోని చెన్నకేశవస్వామి ఆలయంలో ఈవో మద్దిలేటి ఆధ్వర్యంలో పురోహితులు విష్ణుశర్మ, అర్చకులు నారాయణశర్మ పంచాంగ పఠనం చేశారు. రైతులు ఎద్దులకు కాడిగట్టి తమ పొలాలను దుక్కి దున్నారు. ఓర్వకల్లులో వెలసిన అంజనేయస్వామికి ఆకు పూజలు చేశారు. ఓర్వకల్లులో ఎద్దుల బండ్లతో గ్రామోత్సవం నిర్వహించారు. కొమ్ముచెరువు, కాల్వ, భైరాపురం, ఓర్వకల్లులో అంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఓర్వకల్లు చెన్నకేశవస్వామి ఆలయంలో నిర్వహించిన పంచాంగ పఠనంలో జడ్పీటీసీ సభ్యుడు రంగనాథగౌడు, రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, అబ్దుల్లా, అల్లాబాబు, శ్రీరాములు, నాగరాజు పాల్గొన్నారు.

గూడూరు: క్రోధి నామ ఉగాది పర్వదిన వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. మంగళవారం కె .నాగలాపురం సుంకులాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామునుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది.అలాగే గూడూరు పట్టణంలోని స్వయంభూ అంజనేయ స్వామి, సుంకులమ్మ, కాళికామాత, నీలకంఠేశ్వరస్వామి ఆలయాల్లో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అంజనేయస్వామి ఆలయం దగ్గర పురోహితుడు పంచాంగం చదివి వినిపించారు. రైతులు పాల్గొన్నారు.

సి.బెళగల్: క్రోధి నామ ఉగాది పర్వదిన వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. మండల కేంద్రంలో రంగస్వామి ఆలయ అవరణలో గ్రామ పెద్దల సమక్షంలో పురోహితులు నరసింహ్మయ్య పంచాంగం చదివి వినిపించారు. వచ్చే ఏడాది రబీలో రైతులు ఏఏ పంటలకు అధిక బలం ఉంటుంది, వాటి ధరలు ఎలా ఉంటాయని అని రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామోహన్‌రెడ్డి, గోవిందరెడ్డి, మద్దయ్య, రాముడు పాల్గొన్నారు.

కోడుమూరు(రూరల్): మండలంలోని గ్రామాలలో ఉగాదిని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయానే నూతన దుస్తులు ధరించి ఆలయాల్లో పూజలు చేశారు. గోరంట్ల లక్ష్మీమాధవస్వామి, వెంకటగిరి గిడ్డాంజనేయ స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. సాయంత్రం వర్కూంప, గోరంట్ల గ్రామాల్లో లక్ష్మీమాధవులను పల్లకిలో ఉంచి మేళతాళాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. రైతులు పొలాలకు వెళ్లి పూజలు నిర్వహించారు.



ప్రకాశ్‌నగర్‌లోని సుంకులమ్మ ఆలయంలో ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు



రాంబొట్ల ఆలయంలో పంచాంగం వివరిస్తున్న అర్చకులు



గోరంట్లలో లక్ష్మీమాధవస్వామి గ్రామోత్సవం



పూజలందుకున్న స్వామివారు



ఓర్వకల్లులో ఎద్దుల బండ్లతో ఆలయానికి కర్రసాముతో బయలుదేరుతున్న భక్తులు



బళ్లారి చౌరస్తాలో..



కె.నాగలాపురం సుంకులా పరమేశ్వరిని దర్శించుకునేందుకు పోటెత్తిన భక్తులు



సి.బెళగల్‌లో పంచాంగ పఠనం చేస్తున్న పురోహితుడు



ఓర్వకల్లులో..



గూడూరులో..

అలరించిన కవి సమ్మేళనం



కవి సమ్మేళనానికి హాజరైన కేసీ కల్కూర, తదితరులు

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 9: జాతీయ సాహిత్య పరిషత్ కర్నూలు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనం ప్రేక్షకులను ఆకట్టుకుంది. నగరంలోని విద్యానగర్ మాంటిస్సోరి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సాహిత్య పరిషత్ అధ్యక్షులు డా.దండబోయిన పార్వతిదేవి అధ్యక్షత వహించగా.. కార్యదర్శి డా.ఎండీపీఎస్ రామశర్మ సమన్వయకర్తగా వ్యవహరించారు. ముఖ్య వక్తగా విచ్చేసిన గాడిచర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులు కేసీ కల్కూర మాట్లాడుతూ ఉగాది తెలుగువారికి పెద్ద పండుగ అని, తెలుగు సంస్కృతిని గుర్తు చేసే ఈ వేడుక తెలుగుజాతికే గర్వకారణమన్నారు. ఈ కవి సమ్మేళనంలో కా.వెం.సుబ్బలక్ష్మమ్మ, లక్ష్మయ్య, శ్రీనివాసులు, యల మర్తి రమణయ్య తదితర 20 మంది కవులు ఉగాది వేడుక ప్రాశస్త్యాన్ని తమ కవితల్లో వినిపించారు. అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

పండుగలను ఐక్యంగా జరుపుకోవాలి

» రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

కర్నూలు (కల్చరల్), ఏప్రిల్ 9: కులమతాలకు అతీతంగా పండుగలను అందరూ కలిసిమెలిసి జరుపుకోవాలని రాజ్య సభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో మంగళవారం రాత్రి క్రోధి నామ ఉగాది సంబరాలు కన్నుల పండువగా సాగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన టీజీ వెంకటేశ్ కార్యక్రమాలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ పండుగల్లో ఉగాదికి ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. షడ్రుచుల ఉగాది పచ్చడి జీవిత సారాన్ని తెలియజేస్తుందని తెలిపారు. కర్నూలు అభివృద్ధిలో తమ కుటుంబం ఎప్పుడూ పాలు పంచుకుంటుందని, అదే విధానాన్ని తన తనయుడు టీజీ భరత్ కూడా కొనసాగిస్తారని చెప్పారు. చిత్ర నిర్మాత, ఆధ్యాత్మిక గురువు బీవీ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతితో ముడిపడిన వేడుక ఉగాది అని అన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పంచాంగ శ్రవణకర్త భానుశర్మను, కర్నూలు కళాకారులు రాముడు, ఎమ్మార్ రాధిక, మనోహర్‌బాబు, అరుణ, ఇబ్రహీం, కాశీంపీరా, శ్రీనివాసులుకు టీజీ వెంకటేశ్ నగదు పారితోషికాలు అందజేసి ఘనంగా సత్కరించారు. నాదస్వర బృందం శ్రీకృష్ణ, సాయిలు, జితేంద్రలకు కూడా నగదు పారితోషికాలతో సత్కరించారు. ఇటీవల జాతీయ స్థాయిలో ఏడు బహుమతులు సాధించిన 'శ్రీకృష్ణ కర్ణార్జునీయం' నాటక నటీనటులకు ఘనంగా సత్కరించారు. నాటక దర్శకుడు పత్తి ఓబులయ్య చేతుల మీదుగా కళాకారులు మహ్మద్ మియా, పి. రాజారత్నం, జి. శ్రీనివాసరెడ్డి, సంగా ఆంజనేయులు, హసీనా, సి. శ్రీనివాసులు, నాటక రచయిత పల్లేటి కులశేఖర్‌లను ఘనంగా సత్కరించారు. అంతకు ముందు నిర్వహించిన కవి సమ్మేళనంలో కవి ఇనాయతుల్లా ఆధ్వర్యంలో డాక్టర్ వి. పోతన, కల్యాణదుర్గం స్వర్ణలత, డాక్టర్ కె. చంద్రమౌళిని, కొత్తపల్లి సురేష్, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డిలు ఉగాది కవితా గానం చేశారు. కార్యక్రమంలో కూచిపూడి నృత్య గురువులు కరీముల్లా, రోహిత్‌ల ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్య కళారూపాలు సభికులను ఆకట్టుకున్నాయి.



ఉగాది ఉత్సవాలను ప్రారంభిస్తున్న టీజీ వెంకటేశ్

ఖూబ్ సూరత్ మసీదులో టీజీ ప్రార్థనలు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 9: నగరంలోని 10వ వార్డులో పరిధిలో ఉన్న ఖూబ్ సూరత్ మసీదులో కర్నూలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ ప్రార్థనలు చేశారు. మంగళవారం రంజాన్ మాసం సందర్భంగా ఆయన ముస్లింలతో కలిసి మసీదుకు వెళ్లారు. రోజా ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింకు పండ్లు తినిపించారు. వార్డు ఇన్‌చార్జి జియా, టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జహంగీర్‌బాషా, మైనార్టీ సెల్ సెక్రటరీ మన్సూర్ ఆలీఖాన్, మహమ్మద్ ఖాన్, స్థానిక నాయకులు ఇమ్రాన్, సల్మాన్, సుకురు, జుబేర్, తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీతోనే పేదల జీవితాల్లో వెలుగులు

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే పేద ప్రజల జీవితాల్లో వెలుగులు వస్తాయని కర్నూలు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. మంగళవారం నగరంలోని 13 వార్డులో బంగారుపేటలో పలువురు నాయకులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో ధరలు పెరిగిపోయి.. పేద ప్రజల బతుకులు ఛిద్రమైపోయాయన్నారు. చంద్రబాబు వస్తే ధరలు నియంత్రణలో ఉంటాయని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. అంతేకాకుండా వలంటీర్లకు రూ. 10 వేల గౌరవ వేతనం ఇస్తామని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో రూబెన్, జాన్ పాల్, సంపత్, సోమన్న, వినయ్, ప్రవీణ్, బాబ్యూ, క్రాంతి, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

చిన్న అమ్మవారిశాలలో టీజీ భరత్ ప్రత్యేక ప్రార్థనలు

కొత్త సంవత్సరంలో కర్నూలు ప్రజలందరికీ శుభం కలగాలని కర్నూలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ అన్నా రు. మంగళవారం నగరంలోని పూలబజార్‌లో ఉన్న చిన్న అమ్మవారి శాలను భరత్ సందర్శించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పాల్గొన్నారు. కర్నూలు ప్రజలందరూ ఈ సంవత్సరం సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగవీరాంజనేయులు, విఠల్ శెట్టి, శేషగిరిశెట్టి పాల్గొన్నారు.



చిన్నారికి ఖర్జూరం పండు తినిపిస్తున్న టీజీ భరత్



చిన్న అమ్మవారిశాలలో పూజలు చేస్తున్న టీజీ భరత్

వైసీపీకి షాక్

టీడీపీలో చేరిన అమడగుంట్ల కృష్ణారెడ్డి

కోడుమూరు, ఏప్రిల్ 9: కోడుమూరు నియోజకవర్గంలో వైసీపీకి షాక్ తగిలింది. వైసీపీ సీనియర్ నాయకుడు, రిటైర్డ్ ఇరిగేషన్ శాఖ ఎస్‌ఈ అమడగుంట్ల కృష్ణారెడ్డి ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లో టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వైసీపీ ఆవిర్భావం నుంచి అమడగుంట్ల కృష్ణారెడ్డి కోడుమూరు మండలం కాకుండా నియోజకవర్గంలో వైసీపీ బలోపేతానికి ఎంతగానో కృషి చేశారు. 2014 ఎన్నికల్లో ఎం.మణిగాంధీ గెలుపుకోసం కష్టపడ్డారు. 2019 ఎన్నికల ముందు ప్రస్తుత ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్‌ను రాజకీయ తెరపైకి తీసుకొచ్చారు. 2019 ఎన్నికల్లో కూడా జరదొడ్డి సుధాకర్ గెలుపు కోసం శ్రమించారు. 14 సంవత్సరాలుగా కీలకంగా వ్యవహరించి వైసీపీలో కష్టపడినప్పటికీ ఆయనకు గుర్తింపు దక్కలేదు. దీంతో పార్టీపై విసుగుచెందిన కృష్ణారెడ్డి.. టీడీపీ సీనియర్ నాయకుడు డి.విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి టీడీపీలో పని చేయాలని నిర్ణయించుకున్నారు. కృష్ణారెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యుడు కోడుమూరు సహకార సంఘం డైరెక్టర్ చెన్నారెడ్డి కూడా టీడీపీలో చేరారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 9: నగరంలోని 48వ వార్డు పరిధిలోని సుంకేసుల రోడ్డు కోడుమూరు ఎమ్మెల్యే డా.జే. సుధాకర్ ఇంటి వద్ద రోడ్డు, డ్రైనేజీ అస్తవ్యస్తంగా తయారైంది. ఎమ్మెల్యే కావడంతో ఆయన తన ఇంటి ముందు మాత్రమే కాలువలు నిర్మించుకున్నారు. ఎదురుగా ఉన్న ఇళ్లకు కాలువలు లేకపోవడంతో నీరంతా రోడ్లపైన ప్రవహిస్తోంది.



ఎమ్మెల్యే జే.సుధాకర్ ఇంటి సమీపంలో డ్రైనేజీలో పేరుకుపోయిన మురుగు

● **శిలాఫలకానికే పరిమితం..** ఎమ్మెల్యే ఇంటి లైను రోడ్డు నిర్మాణం కోసం గత సంవత్సరం ఆగస్టు 24న శిలాఫలకాన్ని నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ప్రారంభించారు. ఇప్పటి వరకు రోడ్డు పనులు ప్రారంభించలేదు. అదేవిధంగా 2022 అక్టోబరు 29న రూ.42 లక్షలతో ఎమ్మెల్యే ఇంటి నుంచి తుంగభద్ర నదీ తీరం వరకు డ్రైనేజీ నిర్మాణం చేపట్టేందుకు శంకుస్థాపన చేశారు. అయితే పూర్తిస్థాయిలో నిర్మించకుండా మధ్యలోనే వదిలేశారు. దీంతో చివరి వరకు వెళ్లాల్సిన డ్రైనేజీ నీరు రోడ్డుపైకి వస్తోంది.

● **డ్రైనేజీ అస్తవ్యస్తం..** సుంకేసుల రోడ్డులోని కార్తీక ఆసుపత్రి నుంచి కిందకు వెళ్లే దారి అస్తవ్యస్తంగా తయారైంది. రోడ్డు, డ్రైనేజీ లేకపోవడంతో ఇళ్లలోని నీరంతా రోడ్లపైకి చేరి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

ట్యాంకర్లతో తాగునీరు సరఫరా

సి.బెళగల్, ఏప్రిల్ 9: మండల కేంద్రంలో తాగునీటి సమస్య నెలకొనడంతో సర్పంచ్ పాండురంగన్న ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ పాండురంగన్న మాట్లాడుతూ గ్రామంలోని బీసీ, యస్సీ, కొండపేట కాలనీల్లో ఈనెల నుంచి జూన్ వరకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందజేస్తామన్నారు.



ట్యాంకర్‌తో తాగునీరు సరఫరా చేస్తున్న సర్పంచ్

ఘనంగా ప్రభోత్సవం

సి.బెళగల్, ఏప్రిల్ 9: ఉగాది పండుగ సందర్భంగా మండలంలోని మారందొడ్డి గ్రామంలో శివుడి ప్రభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తరలివచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రుక్మాంగద, శ్రీను, పద్మావతమ్మ, సర్పంచ్ శాంతమ్మ పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ తిమ్మారెడ్డి, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



పత్తికొండ బీసీవై అభ్యర్థిగా మిట్టా వెంకటేశ్ యాదవ్

తుగ్గలి, ఏప్రిల్ 9: భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) అధినేత బోడే రామచంద్ర యాదవ్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నట్లు మిద్దె వెంకటేశ్ యాదవ్ తెలిపారు. మంగళవారం జొన్నగిరిలో ఆయన మాట్లాడుతూ బీసీవై అభ్యర్థిగా తన పేరు ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల కష్టాలు ఎలా ఉంటాయో కళ్లారా చూశానని పేర్కొన్నారు. బీసీల ఐక్యతను చాటేందుకే బీసీవై పార్టీ పుట్టిందని, యువతను రాజకీయ చైతన్య వంతులుగా చేయడమే ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

ఆలూరు అభ్యర్థిగా మోహన్ ప్రసాద్

ఆలూరు : ఆలూరు అసెంబ్లీ భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా ఎస్ మోహన్ ప్రసాద్ పేరును ఆ పార్టీ అధిష్ఠానం మంగళవారం ప్రకటించింది. ఆ పార్టీ అధినేత రామచంద్రయాదవ్ ప్రకటించిన మొదటి జాబితాలో మోహన్‌ప్రసాద్‌కు అవకాశం లభించింది. మోహన్‌ప్రసాద్ ఆలూరు నియోజకవర్గంలో మాదాసి కురువ, మాదారి కురువ సంఘానికి ఆయన గౌరవ అధ్యక్షుడిగా పనిచేశారు.

నాటుసారా స్వాధీనం

తుగ్గలి, ఏప్రిల్ 9: నాటుసారా అమ్ముతున్న సారా విక్రేతను అరెస్టు చేసి అతని వద్ద నున్న 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు జొన్నగిరి ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మంగళవారం లక్ష్మీతండాకు చెందిన స్వామినాయక్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

వైసీపీ ప్రభుత్వం ముస్లింలకు చేసింది శూన్యం

మద్దికెర, ఏప్రిల్ 8: వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ముస్లింలకు చేసింది శూన్యమని మాజీ మండల కోఆప్షన్ ఇమామ్‌సాహెబ్, సోషల్ మీడియా కన్వీనర్ హుశేన్‌పీరా అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలో ఉన్న ఐదేళ్లలో ముస్లింలకు రంజాన్, బక్రీద్ పండుగలకు చంద్రన్నతోఫా అందించేవారన్నారు. ఎంతో మంది పేద ముస్లింలు చంద్రన్న తోఫా ద్వారా పండుగలు చేసుకునేవారని గుర్తుచేశారు. సీఎం జగన్ రెడ్డి దుల్హన్ పథకం రద్దు చేసి ముస్లిం మహిళలకు అన్యాయం చేశారన్నారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ముస్లింలను కోరారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ సర్పంచు కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి

మద్దికెర, ఏప్రిల్ 9: స్థానిక మెయిన్‌బజారులో ఫ్రెండ్స్ విద్యానికేతన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ సర్పంచు కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రెండ్స్ విద్యానికేతన్ రామాంజనేయులు ఉచిత చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్య ఉన్నప్పుడు ఈ ఉచిత చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు డి.మురళీధర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మల్లికార్జున యాదవ్, ఫ్రెండ్స్ విద్యానికేతన్ కరస్పాండెంట్ ఎర్రవల్లి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో...

దేవనకొండ : దేవనకొండ టర్నింగ్ వద్ద చంద్రరాజేశ్వరరావు 30వ వర్ధంతి సందర్భంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు మద్దిలేటిశెట్టి ,ఏఐటీయుసీజిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్ణయ్య, సీపీఐ మండల కార్యదర్శి నర్సారావ్ పాల్గొన్నారు.

ఆస్పరి : ఉగాది ఉత్సవాల సందర్భంగా బండమీది వెంకటేశ్వర్లు సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు విరుపాక్షి, శ్రీనివాసులు, శరవణ్ణ, హనుమంతు, ఉప సర్పంచు వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి


మందులు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

మద్దికెర, ఏప్రిల్ 9: ప్రతి ఒక్కరూ సేవగుణం అలవర్చుకోవాలని రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు, ఆర్ఎంపీ వలిసాహేబ్ అన్నారు. మంగళవారం ఉగాది సందర్భంగా ఆంజనేయస్వామి దర్శనార్థం వస్తున్న ప్రజలకు గ్రామ శివారులో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కచాపురంలో జాతర మహోత్సవం జరుగుతుందని, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారని వారందరికీ వైద్య సహాయం కోసం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆర్ఎంపీలు కార్తిక్ రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వీరశైవులకు అవకాశం అభినందనీయం

ఆదోని టౌన్, ఏప్రిల్ 9: డివిజన్‌లోని ఆలూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడానికి వీరశైవ సమాజానికి చెందిన వీరభద్రగౌడ్‌కు అవకాశం కల్పించడం అభినందనీయమని జంగమ హక్కుల పోరాట సమితి నాయకులు కర్నూలు శివరాజ్, ఎండీ భద్రీనాథ్ స్వామి అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ చాలాకాలంగా జంగమ వీరశైవులకు రాజకీయ ప్రాధాన్యత లభించకపోవడంతో తమ సామాజికవర్గం అటు ఆర్థికంగానూ, ఇటు రాజకీయంగానూ అభివృద్ధి చెందలేదన్నారు. టీడీపీ రాష్ట్ర అధినేత చంద్రబాబు నాయుడు ఈసారి ఎన్నికలలో తమ సామాజికవర్గానికి చెందిన సభ్యులను గుర్తించి ఎన్నికలలో పోటీ చేసే అవకాశం కల్పించినందుకు చంద్రబాబునాయుడు, లోకేష్‌బాబులకు కృతజ్ఞతలు తెలిపారు. వీరభద్రగౌడ్ విజయానికి తాము కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మల్లికార్జున, కన్నె కళ్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

గోనెగండ్ల, ఏప్రిల్ 9: ప్రజలు వచ్చే ఎన్నికలలో ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, గోనెగండ్ల సీఐ రామకృష్ణయ్య కోరారు. మంగళవారం బీ అగ్రహారం, బైలుప్పల, గంజహళ్లి గ్రామాల్లో సెంట్రల్ ఫోర్స్ ఎస్ఎస్‌బీ, గోనెగండ్ల పోలీసుల ఆధ్వర్యంలో గ్రావ వీధుల గుండా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌బీ అసిస్టెంట్ కమాండర్ రాకేష్‌కుమార్, సిబ్బంది, పాల్గొన్నారు.

ఎద్దులబండి గిరకలాగుడు బలప్రదర్శన

కోసిగి, ఏప్రిల్ 9: సజ్జలగూడ్డం గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకుని మంగళవారం వీవీఎస్ యూత్ ఆధ్వర్యంలో ఎద్దులబండి గిరకలాగుడు బలప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 12 జతల ఎద్దులు పాల్గొనగా.. ఎల్లప్పగారి మల్లప్పగారికి చెందిన ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచాయి. ఈ ఎద్దులను డప్పు వాయిద్యాలతో గ్రామంలో ఊరేగించారు. అనంతరం గెలుపొందిన రైతుకు మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు గర్జప్ప, భీమేష్, హనుమంతరెడ్డి, సూర్యప్రకాష్, సిద్ధ రమేష్, వెంకటేశ్, నరసప్ప, భీమారెడ్డి, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది సంబరాలు


ఎమ్మిగనూరులో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న జయనాగేశ్వరరెడ్డి, పంచాంగం వినిపిస్తున్న సుబుధేంద్రతీర్థులు, కౌతాళంలో పుస్తకాల ఆవిష్కరణ దృశ్యం

ఆదోని టౌన్, ఏప్రిల్ 9: జిల్లా వ్యాప్తంగా ఉగాది సంబరాలు ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఆదోనిలో గ్రామదేవతల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం తెల్లవారుజామున 5 గంటల నుంచి భక్తులు సుంకలమ్మ, ఎల్లమ్మ, మారెమ్మ ఆలయాల వద్ద బారులుతీరి నిలబడ్డారు.

పత్తికొండ టౌన్ : పట్టణ వ్యాప్తంగా ఉగాది సంబరాలు ఘనంగా జరిగాయి. ఇళ్లల్లో మామిడి తోరణాలు కట్టుకొని ఉగాది పచ్చడి, పిండి వంటలు చేసి స్వామి, అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించారు. ప్రజలు నూతన వస్త్రాలు ధరించి ఆయా దేవాలయాల్లో స్వామి, అమ్మవార్లకు టెంకాయలు, నైవేద్యాలు సమర్పించారు. క్రోధినామ సంవత్సరం ఉగాది సందర్భంగా వేద పండితులు పంచాంగాన్ని చదివి వినిపించారు.

తుగ్గలి : ఉగాది ఉత్సవాలను మండలంలో ఘనంగా నిర్వహించారు. తుగ్గలి, జొన్నగిరి, కడమకుంట్ల తదితర గ్రామాల్లో ఆలయాల్లో పూజలు నిర్వహించి పురోహితులు పంచాంగం వినిపించారు. యువకులు కుందేళ్ల పారువేట నిర్వహించారు.

మద్దికెర: మండలంలో ఉగాది సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. మండల కేంద్రంలో ఆనవాయితీగా వస్తున్న కవిరెడ్డి వీధి యువకులు, బెస్త వీధి యువకులు రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ఆయా ప్రాంతాల మధ్య వ్యక్తిగత కక్షలు ఉండకూడదని ఈ సంప్రదాయం కొనసాగిస్తూ వస్తున్నారు. అలాగే పెరవలి రంగనాథ స్వామి ఆలయంలో పంచాంగం వినిపించారు. దేవాలయ చైర్మన్ ఈడిగ దస్తగిరిగౌడు, ఈవో చంద్రశేఖర్ రెడ్డి, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు: క్రోధి నామసంవత్సరంలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆకాంక్షించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పాత ఆంజనేయ స్వామి ఆలయంలో నాగరాజు స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పంచాంగశ్రవణంలోటీడీపీ నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు.

మంత్రాలయం : రాఘవేంద్రస్వామి మఠంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు బృందావనానికి ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చారు. అనంతరం మఠం ప్రాంగణంలో తులసి పూజ, గోపూజ, తైలాభిషేకం చేశారు. ఊంజల మండపంలో పీఠాధిపతికి పూర్వాశ్రమ తల్లి, వారి కుటుంబ సభ్యులు, మహిళలు పీఠాధిపతికి హారతులు ఇచ్చారు.

గోనెగండ్ల : మండల పరిధిలోని గ్రామాల్లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చింతాముని నల్లారెడ్డి దేవాలయంలో ఉదయం నుంచి భక్తులు పూజా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గోనెగండ్లలో భక్తులు మేళ తాళాల మధ్య పూర్ణకుంభాలతో అమ్మవారి ఆలయానికి చేరుకొని నైవేద్యాలు సమర్పించారు.


గోనెగండ్లలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు, పత్తికొండలో రంగులు చల్లుకుంటూ యువత సంబరాలు, ఆదోనిలో ఆలయం వద్ద భక్తుల క్యూ

ఆదరించండి..గుండెల్లో పెట్టుకుంటా

● మంత్రాలయం టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి


కోసిగిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న రాఘవేంద్రరెడ్డి

కోసిగి, ఏప్రిల్ 9: టీడీపీకి ఆయువు పట్టుగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఎన్నికల్లో తనను ఆదరించి గెలిపించాలని, ఎప్పటికీ గుర్తు పెట్టుకొని గుండెల్లో పెట్టుకుంటానని టీడీపీ మంత్రాలయం అభ్యర్థి ఎన్.రాఘవేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం ఉగాది పండుగ సందర్భంగా ముందుగా కోసిగిలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాఘవేంద్రరెడ్డిని, ఆయన సోదరుడు రామక్రిష్ణారెడ్డిని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి సాగునీటి సంఘం మాజీ చైర్మన్ పల్లెపాడు రామిరెడ్డి, చింతలగేని నర్సారెడ్డి పూలమాలలు, శాలువ వేసి సన్మానించారు. కోసిగిలోని వీరరాజు దొర ఎరువుల దుకాణం నుంచి మార్కెండేయ దేవాలయం వరకు అన్ని వర్గాల ప్రజలను, వ్యాపారస్థులను పలకరిస్తూ తనకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం జయహో బీసీ సభలో ఆయన మాట్లాడుతూ టీడీపీకి బీసీలే పట్టుకొమ్మ అని, బీసీల పార్టీ టీడీపీనే అన్నారు. నాయకులు ముత్తురెడ్డి, రామిరెడ్డి, నర్సారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, సాతనూరు కోసిగయ్య, మాజీ జడ్పీటీసీ తోవి రామక్రిష్ణ, చిన్న తాయన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


రాఘవేంద్రరెడ్డిని సన్మానిస్తున్న కోసిగి వాసులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం


ప్రచారం నిర్వహిస్తున్న వీరభద్రగౌడ్

దేవనకొండ, ఏప్రిల్ 9: రాష్ట్రం అన్ని రంగాలు అభివృద్ధి సాధించాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ ఆలూరు అభ్యర్థి బి.వీరభద్రగౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని గద్దెరాళ్ల, నెల్లిబండ, బండగట్టు, మాచాపురం, కరివేముల విస్తృత ప్రచారం నిర్వహించారు. ముందుగా గద్దెరాళ్ల మారెమ్మవ్వ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ,నియోజకవర్గ ప్రజలకు క్రోధినామ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పాటుపడతానని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల్లో మౌలిక సదుపాయల ఊసేలేదన్నారు. గ్రామాల్లో నాడు చంద్రబాబు ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి మినహా వైసీపీ పాలనలో జరిగిందేమిలేదని విమర్శించారు. రాష్ట్ర భవిష్యత్ కావాలంటే చంద్రబాబే సీఎం కావాలని, టీడీపీకి పట్టం కట్టాలని ప్రజలను కోరారు. మండల కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్, బడిగింజల రంగన్న, మల్లికార్జునగౌడ్, గిడ్డయ్య, రామారావునాయుడు, ఉచ్చీరప్ప పాల్గొన్నారు.

మండలంలో వైసీపీకి భారీ దెబ్బ

మండలంలో టీడీపీలోకి వలసలు ఊపందుకున్నాయి. కరివేముల గ్రామంలో వైసీపీ పార్టీకి చెందిన మండల సచివాయల కన్వీనర్ వీరేష్, వార్డు మెంబర్లు వెంకన్న ,మంగళి శ్రీను, నడిపి ఈరన్న, చిన్న ఈరన్న, రాముడు, సురేష్, కిరణ్‌తోపాటు దాదాపు వంద కుటుంబాలు వీరభద్రగౌడ్ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలలోకి ఆహ్వానించారు. ఎన్నికలలో టీడీపీ అభ్యర్థి విజయం కోసం సైనికుల్లా పని చేస్తామని వీరభద్రగౌడ్‌కి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామాల్లో వీరభద్రగౌడ్‌కి పూలవర్షం కురిపిస్తూ ప్రజలు స్వాగతం పలికారు. మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్ ,కప్పట్రాళ్ల మల్లికార్జున, టీడీపీ, జనసేన, ఐటీడీపీ, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు తదతరులు పాల్గొన్నారు.

బీసీలకు అండ టీడీపీయే : బీవీ


బీవీ జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 9: బడుగు, బలహీన వర్గాలకు అండదండా టీడీపీయేనని టీడీపీ ఎమ్మిగనూరు అభ్యర్థి జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కే తిమ్మాపురం గ్రామనికి చెందిన సీపీఐ నాయకులు, కార్యకర్తలు మంగళవారం బీవీ జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. బీవీ స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన సీపీఐ నాయకులు బీటీ బతకన్న, బీటీ మద్దిలేటి, బీటీ మల్లికార్జున, బీటీ శ్రీరాములు, బీపీ వెంకటేశ్, బీజీ హేమంత్ నాయుడు, వీరాంజనేయులు, రాజు, తిరుమలేష్, తిమ్మప్ప, వీరాస్వామి, చంద్రలతో పాటు మరో వంద మంది మాజీ ఎమ్మెల్యే బీవీ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సదంర్భంగా వారికి మాజీ ఎమ్మెల్యే బీవీ టీడీపీ కండుబా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. జరగబోయే ఎన్నికల్లో టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రంగన్న, కేటీ వెంకటేశులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకై ఇద్దరికి గాయాలు

వెల్దుర్తి, ఏప్రిల్, 9 : ఉగాది రోజున గ్యాస్ లీకై ఇద్దరు వ్యక్తులకు గాయాలైన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక 15వ వార్డులో ప్రభుత్వ ఉపాధ్యాయుడు వెంకటరాముడు భార్య ప్రశాంతి, పిల్లలతో కలసి నివాసం ఉంటున్నారు. వంటచేసే సమయంలో గ్యాస్ లీకై మంటలు వ్యాపించెందాయి. ప్రశాంతితో పాటు మేనల్లుడు శ్రీకర్ తీవ్రంగా గాయపడ్డారు. కాలనీవాసులు మంటలను అదుపుచేసి టీచర్ వెంకటరాముడుకు సమాచారం అందించారు. వెల్దుర్తి సీహెచ్‌సీ ఆసుపత్రిలో వారికి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కో సం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చంద్ర రాజేశ్వరరావు ఆశయాలు సాధిద్దాం

● సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి భీమలింగప్ప


చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 9: భూపోరాట యోధుడు సీపీఐ అగ్రనాయకుడు అమరజీవి చంద్ర రాజేశ్వరరావు ఆశయ సాధన కోసం కృషి చేద్దామని సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి భీమలింగప్ప అన్నారు. మంగళవారం స్థానిక సీఆర్ భవన్‌లో చంద్రరాజేశ్వరరావు 30వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపన్న కుటుంబంలో పుట్టిన చంద్ర రాజేశ్వరరావు పేదలు, అనగారిన వర్గాల కోసం ఎర్రజెండా చేతబూని యావదాస్తిని పేదలకు పంచిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. రాష్ట్రంలో లక్షలాది ఎకరాలను పేదలకు పంచి భూపోరాటాల ముద్దుబిడ్డగా పేరు గడించారని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నబీరసూల్, చేతివృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి కారన్న, సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, సీపీఐ నాయకులు సుంకన్న, మధు తదితరులు పాల్గొన్నారు.

నిందితుడి అరెస్టు


నిందితుడిని అరెస్టు చేసి మీడియాకు చూపుతున్న పోలీసు సిబ్బంది

ఆస్పరి, ఏప్రిల్ 9: మండలంలోని నగరూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు రాముడు ఈ నెల 7వ తేదీన మతిస్థిమితం లేని మహిళ పై అత్యాచారయత్నానికి పాల్పడినట్లు అందిన ఫిర్యాదు మేరకు మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ హనుమంతప్ప తెలిపారు. బాధితురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కన్నులపండుగగా రాములమ్మ అవ్వ రథోత్సవం


వైభవంగా సాగుతున్న రాములమ్మ అవ్వ రథోత్సవం

ఆదోని, ఏప్రిల్ 9: ఆదోని పట్టణంలోని కల్లుబావి కాలనీలోని రాములమ్మ అవ్వ రథోత్సవం కన్నుల పండువగా సాగింది. ఈ రథోత్సవ వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు అవ్వకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని ప్రజలు, భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రథాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. రథం పై దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించగా, భక్తులు తాళ్లతో లాగి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయంలో దేవాలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

శివ నామస్మరణంతో మార్మోగిన ముగతి

నందవరం: ముగతి గ్రామంలో మల్లికార్జున స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మల్లికార్జున స్వామి గుడి దగ్గర నుంచి పెద్దహనుమన్న ఆలయం వరకు రథోత్సవాన్ని శివనామస్మరించుకుంటూ ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, ఎంపీటీసీ పురుషోత్తంరెడ్డి ,రాఘవరెడ్డి, తారకరాముడు, సాయిబాబరెడ్డి పాల్గొన్నారు.

బూదూరులో లక్ష్మమ మహారథోత్సవం

మంత్రాలయం: మండలంలోని బూదూరు గ్రామంలో వెలసిన లక్ష్మమ్మవ్వ దేవత మహారథోత్సవం వైభవంగా జరిగింది. మంగళవారం అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారికి పట్టువస్త్రాలు, బంగారు, వెండి ఆభరణాలతో అలంకరించారు. సాయంత్రం అమ్మవారి మహారథోత్సవాన్ని ఆలయ ప్రాంగణం ప్రాకారం ముందు అంగరంగ వైభవంగా ఊరేగించారు. మంత్రాలయం సీఐ ఎరిషావలి, మాధవరం ఎస్ఐ క్రిష్ణమూర్తి, ఏఎస్ఐ ఆనందరెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ పోలీసుల మధ్య గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

రాజగోపుర నిర్మాణానికి రూ.50 వేలు విరాళం

కౌతాళం, ఏప్రిల్ 9: ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయానికి మంగళవారం ఓ భక్తుడు దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి రూ.లక్ష నగదును ఆన్‌లైన్ ద్వారా స్వామి వారి దేవస్థానానికి విరాళంగా అందించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఈఓ వెంకటేష్ పాలక మండలి అధ్యక్షుడు నాగరాజుగౌడ్ తెలిపారు.

గోనెగండ్లలో ఘనంగా ప్రభోత్సవం


వందగల్లులో ఊరేగుతున్న కృష్ణావధూత స్వామి రథోత్సవం

గోనెగండ్ల, ఏప్రిల్ 9: మండల కేంద్రమైన గోనెగండ్లతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. చింతాముని నల్లారెడ్డి దేవాలయంలో ఉదయం నుంచి భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తులసీ అర్చన, ఆకుపూజ, మహా మంగళహారతి పల్లకి సేవ నిర్వహిచారు. సాయంత్రం గోనెగండ్లలో ఆంజనేయస్వామి దేవాలయం నుంచి ఈశ్వరదేవాలయం వరకు ప్రభోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవ కార్యక్రమంలో కోలాటలు, పాటలు ప్రజలకు ఎంతో ఆకట్టుకున్నాయి. వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్యస్వామి పల్లకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు, డీటీ గురురాజారావు, భాస్కర్‌రెడ్డి, గోవిందు, దొరబాబు, టీడీపీ సాంస్కృతిక విభాగం కర్నూలు పార్లమెంట్ విభాగం ప్రధాన కార్యదర్శి కౌలుట్లయ్యనాయుడు, మాజీ వైస్ ఎంపీపీ బుడ్డప్ప, మాజీ సర్పంచు రంగముని, చెన్నలరాయుడు, కురాకులు సురేష్‌బాబు, యువకులు, గ్రామ పెద్దలు, భక్తులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణావధూత స్వామి రథోత్సవం

కోసిగి : వందగల్లు గ్రామంలో క్రోధినామ ఉగాది పండుగను పురస్కరించుకొని సద్గురు కృష్ణావధూత స్వామివారి 15వ రథోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. పీఠాధిపతి సద్గురు మఠ్రిస్వామి తాతకు 16వ తులాభారాన్ని వందగల్లు గ్రామస్థులు నిర్వహించారు. ఉదయం నుంచే కృష్ణావధూత స్వామికి పంచామృతాభిషేకం, బిల్వార్చన, మహామంగళహారతి పూజలు చేశారు. సాయంత్రం 6 గంటలకు కృష్ణావదూత స్వామి రథోత్సవం రమణీయంగా సాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోసిగి ఎస్ఐ సతీష్ కుమార్ గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

రంజాన్‌కు ముస్తాబైన ప్రార్థనా మందిరాలు


విద్యుత్ కాంతులతో వెలుగుతున్న జామియా మసీదు


వెలిగిపోతున్న పైల్వాన్ మసీదు

ఆదోని టౌన్, ఏప్రిల్ 9: ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని అన్ని ముస్లిం ప్రార్థన మందిరాలు రంగురంగుల దీపాలంకరణతో మెరిసిపోతున్నాయి. దాదాపు 350 సంవత్సరాల క్రితం అప్పటి గవర్నర్ సిద్దిఖి మసూద్ ఖాన్ నిర్మించిన చారిత్రాత్మకమైన జామియా మసీదు దేదీప్యమానంగా వెలిగిపోతోంది. ఈ చారిత్రాత్మకమైన మసీదుతో పాటు పట్టణంలోని ఇతర ప్రార్థనా మందిరాలను చూసేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అనేక మంది వస్తుంటారు. ప్రధాన రహదారిలో హిందువులు, ముస్లింలు కలిసి పూజలు నిర్వహించే దీవానే సాహెబ్ దర్గా (తిక్కస్వామి దర్గా)తో పాటు దులాషా పైల్వాన్ మసీదు, దర్గాలను ఎంతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

హంద్రీనీవా కాల్వ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు



టీడీపీ-జనసేన-బీజేపీ సమన్వయంతో విజయం తథ్యం

● వైసీపీ నేతల భూ కబ్జాలు, అక్రమాలపై విచారణ.. బాధితులకు అండగా ఉంటాం

● కర్నూలు కార్పొరేషన్ 16 వార్డుల్లో రోజూ తాగునీరు

● ఓర్వకల్లు కేంద్రంగా పారిశ్రామిక ప్రగతి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అభివృద్ధే లక్ష్యం





పాణ్యం నియోజకవర్గం అభివృద్ధే మా లక్ష్యం అంటున్నారు పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత. అభివృద్ధి అజెండా మీద ఎక్కడ సమస్యలు ఉన్నా.. ఏ కుటుంబానికి అన్యాయం జరిగినా గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి దంపతులు అక్కడ వాలిపోతారు. అధికారం మాటున వైసీపీ నాయకులు సాగిస్తున్న భూ కబ్జాలు, అవినీతి అక్రమాలు, దౌర్జన్యాలపై పోరాటం సాగిస్తూనే.. బాధిత కుటుంబాలకు మేమున్నామనే భరోసా ఇస్తూ ఎన్నికల్లో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ప్రజలు చరితమ్మ అంటూ ఆప్యాయంగా పిలుచుకునే మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత పాణ్యం నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలో దిగారు. ప్రచారంలో జోరు.. జోష్ పెంచారు. 2014లో ఎమ్మెల్యేగా గెలిచి ఐదేళ్లు ప్రజా సేవలో మమేకమైన తనకు ఈ ప్రాంతం సమస్యలు.. ప్రజల కష్టాలు బాగా తెలుసని అంటున్నారు. టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం జూన్ 4 తరువాత కొలుదీరనుందని అంటున్నారు. ఓర్వకల్లు కేంద్రంగా పారిశ్రామలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పిస్తామని, హంద్రీనీవా కాల్వ నుంచి కల్లూరు మండలంలో చెరువులు నింపుతామని, ప్రత్యేకంగా ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి ఓర్వకల్లు మండలంలో సాగు, తాగునీరు అందిస్తామని గౌరు చరిత అంటున్నారు. అలగనూరు, గోరకల్లు రిజర్వాయర్ల మరమ్మతలు పూర్తి చేస్తామని, పాణ్యం నియోజకవర్గం పరిధిలోకి వచ్చే కర్నూలు నగరపాలక సంస్థలోని 16 వార్డులకు రోజూ తాగునీరు అందించేందుకు కొత్తగా ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణానికి కృషి చేస్తామంటున్నారు. మీ ఇంటి ఆడపడుచులా ఆదరించి తనను ఎమ్మెల్యేగా గెలిపించమని, అభివృద్ధిలో పాణ్యం రోల్ మెడల్‌గా తీర్చిదిద్దే బాధ్యత తాను తీసుకుంటానని గౌరు చరిత పేర్కొన్నారు. ఆమెతో ఆంధ్రజ్యోతి చేసిన ఇంటర్వ్యూ ముఖ్యాంశాల్లోకి వెళితే...

కర్నూలు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):

● ఆంధ్రజ్యోతి ప్రతినిధి: పాణ్యం టీడీపీ అభ్యర్థిగా అధినేత చంద్రబాబు తొలి జాబితాలో మిమ్మల్ని ఎంపిక చేశారు.. ఎలా ఫీల్ అవుతున్నారు?

● **టీడీపీ అభ్యర్థి గౌరు చరిత :** చాలా సంతోషంగా ఉంది. 2019 నుంచి ప్రజల మధ్యనే ఉన్నాం. అధిష్టానం ఏ కార్యక్రమం చేపట్టినా విజయవంతం చేశాం. వైసీపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగట్టాం. పాణ్యంలో గౌరు చరితమ్మ గెలుస్తుందని అన్ని రకాల సర్వేలు చెబుతున్నాయి.

● నోటిఫికేషన్‌కు మిగిలిన గడువు వారమే.. ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నట్లు ఉన్నారు.. ఎలా సాగుతున్నాయి..?

● **గౌరు:** ప్రచారం జోరుగా సాగుతోంది. ఎక్కడికి వెళ్లినా అనూహ్య స్పందన వస్తోంది. మా నియోజకవర్గంలో 3.25 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ముఖ్యంగా కర్నూలు కార్పొరేషన్ పరిధిలో 16 వార్డులపై ప్రత్యేక దృష్టిని పెట్టాం. ఇప్పటికే ఓ దఫా ఇంటింటి ప్రచారం పూర్తి చేశాం. రెండో విడత ప్రచారానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

● మీ నియోజకవర్గంలో దొంగ ఓట్లు ఎక్కువగా ఉన్నాయి.. వాటిని అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు..?

● **గౌరు:** వైసీపీ నాయకులు అధికారం అడ్డం పెట్టుకుని విచ్చలవిడిగా దొంగ ఓట్లు చేర్పించారు. 8 వేల ఓట్లు గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేసి తొలగించాం. వైసీపీ అభ్యర్థి కాటసాని ఇంటి దగ్గరలో జడ్పీ ఉన్నత పాఠశాలలో 11 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లి 5 కేంద్రాలు ప్రజలకు దగ్గరకు మార్చాం. ఒకే ఇంట్లో భార్యా భర్తల ఓట్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఉన్నాయి. వీటి వల్ల కొంత ఇబ్బందిగా ఉన్నమాట నిజమే.

● వైసీపీ వలంటీర్లను ఉపయోగించుకొని అధికారంలోకి రావాలని చూస్తోంది. వారిని ఎలా కట్టడి చేస్తారు?

● **గౌరు :** వలంటీర్లను ఎన్నికల విధులకు వినియోగించరాదని ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. కొందరు వలంటీర్లు వైసీపీ సేవలో తరిస్తున్నారు. వారిని దీటుగా ఎదుర్కొనేందుకు మాకు పక్కా ప్రణాళిక ఉంది. 50 ఇళ్లకు ఒకరు కేఎస్ఎస్‌లను నియమించాం. వైసీపీ రాజకీయాలకు బలి కావద్దని వలంటీర్లను కోరుతున్నాను.

● ప్రచారంలో ప్రజల నుంచి స్పందన ఎలా ఉంది..?



● **గౌరు :** కర్నూలు నగరంలో ఏ వార్డుకు వెళ్లినా.. కల్లూరు, ఓర్వకల్లు, పాణ్యం, గడివేముల మండలాల్లో ఏ పల్లెకు వెళ్లినా ప్రజల నుంచి అనూహ్య స్పందన ఉంది. అమ్మా..! ఎండల్లో మీరెందుకు వస్తారు.. ఈ జగన్‌ను.. ఎమ్మెల్యే కాటసానిని ఓడించే బాధ్యత మేము తీసుకుంటాం.. అంటూ ప్రజలు అంటున్నారు. వైసీపీ అరాచకాలు పోవాలి.. రాష్ట్రం బాగుపడాలి అంటే చంద్రబాబు రావాలని ప్రజలు అంటున్నారు. మళ్లీ జగన్‌కు అధికారం ఇస్తే దోపిడీ చేయమని ఇంటి తాళం వారి చేతిలో పెట్టినట్లే.. ఆ తప్పు మేము చేయం.. మీరు నిశ్చింతగా ఉండండి... మిమ్మల్ని గెలిపించుకునే బాధ్యత మాది అంటూ జనమే మాకు గెలుపు భరోసా ఇస్తున్నారు. ఇంతటి స్పందన మునుపెన్నడూ చూడలేదు.

● నగరం.. పల్లెటూళ్లు చుట్టేస్తున్నారు.. ప్రజలు ఎలాంటి సమస్యలు మీ దృష్టికి తీసుకొస్తున్నారు?

● **గౌరు :** ముఖ్యంగా కర్నూలు నగరం పరిధిలోని 16 వార్డులకు రెండు రోజులకు ఒకసారి తాగునీరు వస్తోంది. పల్లెల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. మురుగు కాల్వలు, రోడ్లు, పేదలకు పక్కా ఇళ్లు, గ్రామాల్లో కరువు, సాగునీరు, ఉద్యోగాలు రాక ఆందోళన చెందుతున్న నిరుద్యోగ యువత.. ఇలాంటి ఎన్నో సమస్యలు మా దృష్టికి వచ్చాయి.

● వాటి పరిష్కారానికి మీ వద్ద ఉన్న ప్రణాళిక ఏంటి ..?



అమ్మ గెలుపు కోసం ప్రచారం నిర్వహిస్తున్న గౌరు జనార్దన్ రెడ్డి

● **గౌరు :** చంద్రబాబును సీఎం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. రాబోయేది ఎన్డీఏ ప్రభుత్వమే. పాణ్యం నియోజకవర్గంలో వచ్చే కర్నూలు నగరపాలక సంస్థలోని 16 వార్డుల్లో ప్రజలకు రోజూ తాగునీరు ఇచ్చేందుకు మరో ఎస్ఎస్ ట్యాంకు నిర్మించే దిశగా ప్లాన్ చేస్తున్నాం. గోరుకల్లు నుంచి కూడా పైపులైన్ వేసి తాగునీరు అందించేందుకు అవకాశాలపై నిపుణుల కమిటీతో సర్వే చేయిస్తాం. డ్రైనేజీలు, రోడ్లు నిర్మించి మెరుగైన పారిశుధ్యం కోసం చర్యలు తీసుకుంటాం. మా ప్రభుత్వం ఏర్పాటైన నెల రోజుల్లోనే టిడ్కో ఇళ్లు పంపిణీ చేస్తాం. పార్కుల అభివృద్ధి చేస్తాం. కబ్జాల కోరల నుంచి రక్షిస్తాం.



గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డితో నారా లోకేశ్ (ఫైల్)

● మీ ప్రత్యర్థి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అనుచరులపై వస్తున్న అవినీతి ఆరోపణలపై మీ కామెంట్..?

● **గౌరు :** పాణ్యం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పకడ్బందీగా ఆయన అనుచరుల ద్వారా జగన్నాథగట్టు సహా పాణ్యం, ఓర్వకల్లు మండలాల్లో ఎర్రమట్టి, నల్లమట్టి, చెరువుల్లో మట్టి కొల్లగొట్టారు. భూకబ్జాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. మసీదు (వక్ఫ్) ఆస్తులు కూడా వదలట్లేదు. వారి దౌర్జన్యాలతో ప్రజలు విసిగిపోయారు. ప్రతిపక్ష పార్టీ నాయకురాలిగా ఇప్పటికే కలెక్టరుకు పలుమార్లు ఫిర్యాదు చేశాను. నేను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఎమ్మెల్యే కాటసాని అనుచరులైన వైసీపీ నాయకులు అధికారం మాటున సాగించిన భూకబ్జాలపై ప్రత్యేక విచారణ చేయించి చర్యలు తీసుకుంటాం. ఎవరిని ఉపేక్షించే ప్రసక్తే లేదు.

● వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం.. మీరు ఎమ్మెల్యేగా గెలిచాక చేపట్టబోయే అభివృద్ధి విషయంలో ఎలాంటి హామీలు ఇస్తారు..?

● **గౌరు:** పాణ్యం నియోజకవర్గంలోకి వచ్చే కర్నూలు కార్పొరేషన్ పరిధిలో 16 వార్డులకు రోజూ తాగునీరు ఇచ్చేందుకు మరో ఎస్ఎస్ ట్యాంకు నిర్మించేందుకు కృషి చేస్తా.

☛ గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు పేదలకు పంపిణీ చేస్తాం.

☛ నగరంలో పార్కులు సంరక్షణ, అభివృద్ధి, మెరుగైన పారిశుధ్యం నిర్వహణ పనులు చేపడతాం.

☛ గడివేముల మండలంలో జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిన అలగనూరు రిజర్వాయరుకు మరమ్మతులు చేసి కేసీ ఆయకట్టుకు సాగునీరు ఇస్తాం.

☛ గోరుకల్లు జలాశయం మరమ్మతులు రూ.90 కోట్లతో చేపడుతాం.

☛ అసంపూర్తిగా వదిలేసిన ఉర్దూ యూనివర్సిటీ భవనాలను పూర్తి చేస్తాం.

☛ ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ కేంద్రంగా కొత్తగా పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పిస్తాం. ఇక్కడి పరిశ్రమల్లో 70 శాతం స్థానికులకే ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం.

☛ సోలార్, విండ్‌పవర్, పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్లాంట్ వల్ల నష్టపోయిన పిన్నాపురం సహా వివిధ గ్రామాల రైతులకు న్యాయం చేస్తాం.

☛ గడివేముల గ్రామానికి బైపాస్ రోడ్డు నిర్మిస్తాం.

☛ వెలగమాను డ్యాం నిర్మాణం సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయించి.. నిపుణుల నివేదిక ప్రకారం ముందుకు వెళ్తాం.

☛ కర్నూలు కార్పొరేషన్ వార్డులు సహా కల్లూరు, ఓర్వకల్లు, గడివేముల, పాణ్యం మండలాల్లో అర్హత కలిగిన పేదలందరికీ 2 సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి పక్కా ఇళ్లు నిర్మిస్తాం.

☛ హంద్రీ నీవా కాల్వ నుంచి కల్లూరు మండలంలో చెరువులు నింపే పనులకు శ్రీకారం చుడుతాం. ఎత్తిపోతల పథకం ద్వారా ఓర్వకల్లు మండలంలో తాగు, సాగునీరు ఇచ్చేందుకు కృషి చేస్తాం.

☛ గ్రామాల్లో ప్రతి ఇంటికి కుళాయి, మరుగుదొడ్లు ఏర్పాటు చేయించి మహిళల ఆత్మగౌరవం పెంచుతాం.

● గౌరు కుటుంబం అంటే తెలియని వారు లేరు.. ఈ ఎన్నికల్లో విజయ వ్యూహాలు ఏమిటి..?

● **గౌరు :** ఎన్నికల్లో గెలవాలంటే వ్యూహం తప్పనిసరి. అభ్యర్థిగా నేను ప్రచారం చేస్తున్నాను. రాజకీయ, ఎన్నికల వ్యూహాలు నా భర్త గౌరు వెంకటరెడ్డి అమలు చేస్తున్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ.. బాబు ష్యూరిటీ, మహాశక్తి పథకం ద్వారా మహిళలకు నెలకు రూ.1,500 (ఒక ఇంట్లో 18 ఏళ్లు పైబడిన ఎందరుంటే అందరికీ) ఇంట్లో ఎందరు పిల్లలు చదువుతున్నా అందరికీ ఒక్కొక్కరికి రూ.15వేలు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, అన్నదాత పథకం కింద రైతుకు ఏడాదికి రూ.20వేలు సాయం, ఇంటింటికి కొళాయి, యువగళం పథకం ద్వారా 20 లక్షల ఉపాధి అవకాశాలు, లేదా రూ.3 వేల నిరుద్యోగ భృతి.. ఇలా సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం చేస్తున్నాము. జాబు రావాలంటే.. బాబు రావాలని యువత విశ్వసిస్తున్నారు.

● జగన్ ప్రభుత్వం ఉర్దూ విశ్వవిద్యాలయం భవనాలు అసంపూర్తిగా వదిలేశారు. దీనిపై మీ సమాధానం.

● **గౌరు :** టీడీపీ ప్రభుత్వం రాగానే చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ఈ పనులు చేపడుతాం. కర్నూలు జిల్లాలో ముస్లిం మైనార్టీలు అధికంగా ఉండటంతో చంద్రబాబు ఉర్దూను రెండో అధికార భాషగా ప్రకటించి డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ స్థాపించారు.

● ఆంధ్రజ్యోతి : టీడీపీ అధినేత ఇస్తున్న భవిష్యత్తుకు గ్యారెంటీ.. బాబు ష్యూరిటీపై ఎలాంటి స్పందన ఉంది...?

● **గౌరు చరిత :** మహిళాలోకం నుంచి ఊహించని స్పందన వస్తోంది. చంద్రబాబు సీఎం అయితేనే మహిళల ఆర్థిక ప్రగతి సాధ్యమని భావిస్తున్నారు. సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు దగ్గరయ్యాయి. పేదలు ధనవంతులు కావాలంటే చంద్రబాబు సీఎం కావాలని ప్రజలు విశ్వసిస్తున్నారు.



● యువనేత లోకేశ్ పాదయాత్ర సందర్భంగా ఎలాంటి సమస్యలు మీ దృష్టికి వచ్చాయి..? వాటి పరిష్కారానికి ఎలాంటి ప్రణాళికలు సిద్ధం చేశారు..?

● **గౌరు :** కల్లూరు మండల గ్రామాల్లో తాగునీటి సమస్య, అభివృద్ధికి నోచుకోని చెన్నరాయునితిప్ప ఆధునికీకరణ పనులు, ఓర్లకల్లు కేంద్రంగా పరిశ్రమలు తెచ్చి యువతకు ఉపాధి చూపడం, గొర్రెలకు బీమా కల్పించడం వంటి పలు సమస్యలు యువనేత నారా లోకేశ్ దృష్టికి వచ్చాయి. మా ప్రభుత్వం రాగానే చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తాను.

● భైరెడ్డి టీడీపీలో చేరారు.. ఆయన కూతురు భైరెడ్డి శబరి ఎంపీగా పోటీ చేస్తున్నారు. సమన్వయం చేసుకుని ముందుకు వెళ్తున్నారా...?

● **గౌరు :** మా ఇద్దరి లక్ష్యం ఒక్కటే. పాణ్యం ఎమ్మెల్యేగా నేను.. నంద్యాల ఎంపీగా భైరెడ్డి శబరి గెలవాలి. సమన్వయంతో కలిసి ప్రచారంలో ముందుకు సాగుతాం. మేము గెలవాలి.. టీడీపీ అధికారంలోకి రావాలి.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలి. ఇదే అజెండాతో ఇద్దరం కలిసి ముందుకు సాగుతాం.

● రాజకీయాల్లోకి రావడానికి స్ఫూర్తితో ఎవరు.. ఎందుకు రావాలనుకున్నారు..?

● **గౌరు** : నేను రాజకీయాల్లోకి రావడానికి నా భర్త గౌరు వెంకటరెడ్డినే స్ఫూర్తి. ఆయనే నాకు రోల్ మోడల్. ఓ కేసులో నా భర్తకు శిక్ష పడితే.. గౌరు వర్గానికి, ప్రజలకు అండగా.. అందుబాటులో ఉండాలని నేను రాజకీయాల్లో అడుగులు వేశాను. 2004లో నందికొట్కూరు నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టాను. అలా రాజకీయాల్లోకి వచ్చాను.

● టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలను సమన్వయం చేసుకుంటూ ఎలా ముందుకు వెళ్తారు..?

● **గౌరు :** మా నియోజకవర్గంలో ఎలాంటి సమస్య లేదు. సమన్వయంతో ముందుకు వెళ్తున్నాం. మా కూటమి ఏకైక లక్ష్యం సైకో జగన్‌ను ఇంటికి పంపించాలి.. విధ్వంస పాలనకు స్వస్తి చెప్పాలి..

● మీ బాల్యం.. విద్యా, వివాహం, కుటుంబం వివరాలు.. .

● **గౌరు :** మా స్వగ్రామం నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామం. మా అమ్మనాన్నలు సూదిరెడ్డి బాలనాగమ్మ, సూదిరెడ్డి మల్లారెడ్డిలకు కుమారుడు, ఇద్దరు కూతుళ్లు సంతానం. రెండో కూమార్తె నేను. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు మా ఊరి జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివాను. ఇంటర్మీడియట్ కర్నూలులోని ఓ ప్రైవేటు కాలేజీలో చేరితే.. ఇక్కడి వాతావరణం సరిపోక. నందికొట్కూరుకు వెళ్లాల్సి వచ్చింది. అక్కడే ఇంటర్, డిగ్రీ పూర్తి చేశాను. డిగ్రీ అయిపోగానే.. బ్రహ్మణకొట్కూరుకు చెందిన గౌర వెంకటరెడ్డితో నాకు పెళ్లి వివాహమైంది. మాకు కుమారుడు, కూతురు ఇద్దర సంతానం. కొడుకు జనార్దన్ రెడ్డి ఉద్యోగం చేస్తున్నాడు. కూమార్తె చిద్విలా రెడ్డి చదువుకుంటోంది.



పత్తి పంటను పరిశీలిస్తున్న చంద్రబాబు, గౌరు చరిత (ఫైల్)



నారా లోకేశ్ నిర్వహించిన యువగళం పాదయాత్రలో...(ఫైల్)

● మీ కుటుంబ రాజకీయ నేపథ్యం వివరిస్తారా..?

● **గౌరు :** మా తాతయ్యలు గౌరు ఈశ్వర్ రెడ్డి, గౌరు జనార్దన్ రెడ్డి ప్రజలకు సేవల చేయాలనే లక్ష్యంతో రాజకీయాలు చేశారు. అలా మా కుటుంబం జిల్లాలో ప్రముఖ రాజకీయ కుటుంబాల్లో ఒకటిగా మారింది. నా భర్త గౌరు వెంకటరెడ్డి తొలిసారిగా 1999లో నందికొట్కూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఆ తర్వాత ఓ కేసులో శిక్ష పడి జైలుకు వెళ్లాల్సి వచ్చింది. ఆ సమయంలో మా ఆయన కోరిక మేరకు, ఆయన రాజకీయ వారసురాలిగా రాజకీయ రంగ ప్రవేశం చేశాను. 2004లో నేను నందికొట్కూరు నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టాను. 2009లో నియోజకవర్గాల పునర్విభజన వల్ల పాణ్యంకు రావాల్సి వచ్చింది. 2014లో ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలిచాను. 2019లో టీడీపీలో చివరి క్షణంలో చేరడంతో పోల్ మేనేజ్మెంట్ సక్రమంగా చేసుకోకపోవడం వల్ల ఓటమి చెందాల్సి వచ్చింది. తాజా ఎన్నికల్లో మా గెలుపు తథ్యం. సర్వేలు కూడా అదే చెబుతున్నాయి.